ప్రజాశక్తి

సోమవారం 8 జనవరి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





'ఎస్మా'పై నిరసన జ్వాల

- ఎన్ని చట్టాలు తెచ్చినా భయపడేదే లేదు..
- 27వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె



బాపట్లలో ఎస్మా జీవో ప్రతులు దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-బాపట్ల

ఎస్మా కాదు ఎన్ని చట్టాలు అంగన్వాడీలపై ప్రయోగించినా జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వెనక్కి తగ్గేదే లేదని అంగన్‌వాడీల యూనియన్ బాపట్ల జిల్లా కార్యదర్శి రేఖ ఎలిజిబెత్ స్పష్టం చేశారు. ఆదివారం అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద జీవో నెంబర్ 2 (ఎస్మా) ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేశారు. 24 గంటల రెండో రోజు దీక్షలో కూర్చున్న వారికి రేఖ పూలదండలు వేసి దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా రేఖ ఎలిజిబెత్ మాట్లాడుతూ అంగన్‌వాడీలకు కనీస వేతనం అమలు చేసే వరకు ప్రభుత్వ బెదిరింపులకు వెనకడుగు వేసేది లేదన్నారు. ఇంతటి మొండి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో అంగన్వాడీగా పనిచేస్తున్నందుకు సిగ్గుపడుతున్నామన్నారు. అంగన్వాడీల సమ్మె 24 గంటల దీక్షలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మజుందార్ సంఘీభావం తెలిపి.. మాట్లాడారు. 27 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా ప్రయోగించటాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను తిప్పికొట్టటానికి అన్ని కార్మిక సంఘాలు, రాజకీయ పార్టీలతో కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. 24 గంటల నిరాహార దీక్షకు కూర్చున్న వారిలో జి.అనిత, కె.కష్ణవేణి, వెంకటలక్ష్మి, కె.పార్వతి, యు.నాగమణి ఉన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాలు సుభాషిణి, శరత్, సామేలు, ఆర్య, అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.ఝాన్సీ, యూనియన్ నాయకులు శైల శ్రీ, జి.శారద, మమత, హేమ, సీత, అనిత పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠినచర్యలు

ఎస్పీ వకుల్‌జిందాల్

8లో

తాడోపేడో..!



- నేడు సిఎం జగన్‌ను కలవనున్న బాలినేని
- ఇళ్లస్థలాలు, మాగుంటకు టిక్కెట్.. కీలక ఎజెండాలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వైసిపిలో కీలక ఘట్టం వచ్చేసింది. చాలా రోజులుగా అధిష్టానం తీరుపై అసంతృప్తితో హైదరాబాద్‌లోనే ఉండిపోయిన మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం నాడు మరోసారి సిఎం జగన్‌తో భేటీ కానున్నారు. సిఎం జగన్‌తో భేటీకి ఎజెండాను సిద్ధం చేసుకున్నారు. అన్ని విషయాలూ తేల్చుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. ఒంగోలులో 25 వేల మందికి ఇళ్లస్థలాలకు నిధులు, మాగుంటకు తిరిగి ఎంపీ సీటు కేటాయింపు ప్రధాన ఎజెండాలుగా ఖరారు చేసుకున్నారు. కొన్ని అసెంబ్లీ స్థానాల్లో పోటీలో ఉంచాల్సిన అభ్యర్థులపైనా స్పష్టతతో ఉన్నారు. ఆయన జాబితాను ఇప్పటికే సిఎం జగన్ ఎదుట ఉంచారు.

ఇప్పుడు సోమవారం నాటి భేటీ కీలకంగా మారింది. సిఎం జగన్ స్పందనను బట్టే ఆయన భవిష్యత్ నిర్ణయం ఉంటుందనే చర్చ సాగుతోంది. ఇప్పటికే ఆయనపై పలురకాలుగా ప్రచారాలు సాగుతున్నాయి. వాటిని ఆయన కొట్టిపారేసినా సిఎం జగన్ భేటీలో సానుకూల నిర్ణయాలు జరిగితే తప్ప ఆయనపై సాగే ప్రచారాలకు తెరపడే అవకాశం లేదు. ఇక తాడోపేడో తేల్చుకునేందుకు ఆయన సిద్ధమయ్యారనే చర్చ సాగుతోంది. ఈ భేటీతో ఆయన రాజకీయ భవితవ్యం కూడా ఏమిటనేది తేలిపోతుందనే ఉత్కంఠ చర్చ కూడా పాలకపక్ష నేతల్లో ఉంది. రెండు జాబితాలు ప్రకటించినప్పటికీ ఒంగోలు స్థానాన్ని బాలినేనికి కేటాయించలేదు. ఆయన్ను గిద్దలూరుకు వెళ్లాలని సిఎం జగన్ సూచించారు.ఆయన మాత్రం ఇచ్చిన మాట ప్రకారం పేదలకు 25 వేల ఇళ్లస్థలాలు ఇచ్చి ఒంగోలులోనే పోటీ చేయాలనే ఆలోచనలో గట్టిగా ఉన్నారు. అందుకు చాలాకాలంగా సానుకూల పరిస్థితి కనిపించలేదు. కారణం అందుకు అవసరమైన నిధులు రూ.160 కోట్ల వరకూ విడుదల చేయాల్సి ఉంది. ఇప్పుడు వీటిపై బాలినేని గట్టిగా తేల్చుకోవాలనే ఆలోచనలో ఉన్నారు. నిధుల విడుదలకు సన్నాహాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. గట్టి నమ్మకంలోనే ఉన్నారు. ఇదే జరిగితే బాలినేని ఒంగోలు నుంచే పోటీ చేయడం ఖాయమవుతుందని సమాచారం. రెండో ఎజెండా మాగుంట వ్యవహారం. ఆయనకు ఎంపీ సీటు తిరిగి కేటాయించాలని చాలాకాలంగా బాలినేని కోరుతున్నారు. ఇటీవల కాలంలో మాగుంటకు టిక్కెట్ లేదనే ప్రచారం కూడా బాలినేనిని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఇటీవల వరకూ టిటిడి మాజీ ఛైర్మన్ వైవి.సుబ్బారెడ్డి వల్లనే మాగుంటకు ఇబ్బంది వస్తోందని భావించారు. అయితే జాబితాలు విడుదలయ్యాక రాజకీయ బదిలీలు జరిగాయి. దీంతో రాష్ట్రస్థాయిలోనే మార్పుల దిశగా తీసుకునే చర్యల్లో భాగమనే ఇప్పుడు భావించాల్సి వస్తోంది. ఏదేమైనా మాగుంటకు టిక్కెట్టు కోసం బాలినేని శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితమే హైదరాబాద్‌లో ఇద్దరూ భేటీ అయ్యారు. ఎంపీ సీటుపైనే ఇద్దరి మధ్య చర్చ సాగింది. సోమవారం నాడు సిఎం జగన్‌ను కలిసి గట్టిగా అడుగుతానని బాలినేని ఈ సందర్భంగా మాగుంటకు హామీ ఇచ్చారు. నిరాకరిస్తే తర్వాత ఆలోచించాలని చర్చ సాగినట్లు సమాచారం. మాగుంటకు తిరిగి సీటు కేటాయించడం బాలినేనికి కీలకంగా మారింది. ఇద్దరి జోడీ ఉంటేనే గెలుపు సునాయాసమవుతుందనే భావన ఇద్దరి మధ్య ఉంది. కాంబినేషన్ దెబ్బతినకుండా చూసుకునేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు అధిష్టానం సానుకూలంగా స్పందించకపోతే మాగుంట తెలుగుదేశంలో చేరతారనే ప్రచారం కూడా సాగుతోంది. తనతో పాటు బాలినేని కూడా తీసుకుపోయేందుకు పావులు కదుపుతున్నారని సమాచారం. అటు తెలుగుదేశం కీలక నేతలతో టచ్‌లో ఉన్నట్లు ఆదివారం నాడు పెద్దఎత్తున చర్చ సాగుతోంది. కనిగిరిలో తెలుగుదేశం అధినేత చంద్రబాబు, జిల్లా నేతల మధ్య ▶ 2లో

మూఢనమ్మకాలు..ప్రగతి నిరోధకాలు

- జెవివి జిల్లా గౌరవ సలహాదారు ఏవి.పుల్లారావు
- జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు విజయవంతం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జెవివి నాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మూఢ నమ్మకాలు సమాజ ప్రగతికి నిరోధకాలని, జ్ఞానవంతమైన సమాజమే అభివృద్ధి చెందుతుందని జనవిజ్ఞానవేదిక జిల్లా గౌరవ సలహాదారు ఏవి.పుల్లారావు తెలిపారు. మద్దిపాడు మండలం, ఏడుగుండ్లపాడులోని శ్రీ హర్షిణి జూనియర్ కళాశాలలో జెవివి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఆదివారం విజయవంతంగా జరిగాయి. కార్యక్రమానికి జెవివి ఒంగోలు నగర అధ్యక్షులు ఎస్‌వి.రంగారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏవి పుల్లారావు మాట్లాడుతూ జ్ఞానవంతమైన సమాజమే అభివద్ధి చెందుతుందని, సత్యాన్ని అన్వేషించడం ద్వారా మాత్రమే సమాజం జ్ఞానాన్ని సాధించగలదన్నారు. శ్రీ హర్షిణి విద్యాసంస్థల అధినేత గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ మూఢనమ్మకాలను తొలగించేందుకు జెవివి చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. జిల్లా ఉప విద్యాశాఖాధికారి అనితా రోజ్ మేరీ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దకృథం కలిగి వుండాలని, సైన్స్ అంశాలపై ఆసక్తిని పెంపొందించుకోవాలన్నారు. జిల్లా సైన్స్ అధికారి టి.రమేష్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక నిర్వహించే చెకుముకి పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థులు సమాజంలో ప్రస్తుతం శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు, డాక్టర్లుగా ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారన్నారు. డిసిఈబి కార్యదర్శి వై.వెంకట్రావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సజనాత్మకతను, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడానికి ఈ పరీక్షలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు మండ్ల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సిహెచ్ జయప్రకాష్, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.స్వరూపారెడ్డి, యు.భాస్కర్, సీనియర్ నాయకులు కె సుబ్రహ్మణ్యాచారి, షేక్ ఖాజా హుస్సేన్, జిల్లా కోశాధికారి తిరుపతయ్య, యన్.టి.వెంకటేష్, నల్లూరి వెంకటేశ్వరరావు, జి.శ్రీనివాస రెడ్డి, బి.దేవప్రసాద్, మెజీషియన్ బి.వి.రామన్ పాల్గొన్నారు.

గెలుపొందిన పాఠశాలలు ఇవే..

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ పరీక్షలలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలల నుండి 55 బందాల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో జడ్పీహెచ్‌ఎస్ మహమ్మదాపురం (హెచ్‌ఎంపాడు మండలం), ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వై.పాలెం, జడ్పీహెచ్‌ఎస్ మొగల్లూరు (వెలిగండ్ల మండలం) ▶ 2లో



చెత్త వాహనాన్ని అడ్డుకుంటున్న మున్సిపల్ కార్మికులు

సమస్యలు పరిష్కరించే వరకు పోరు

చెత్త తరలింపు వాహనాన్ని అడ్డుకున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-కనిగిరి

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం ఆగదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు, ఏఐటీయూసీ నాయకులు బాలిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట చెత్త తరలింపు వాహనం వీధుల్లోకి వెళ్లకుండా కార్మికులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కార్మికులకు సర్దిచెప్పే ప్రయత్నం చేసిన ఫలితం లేకుండా పోయింది. చెత్త తరలింపు వాహనం బయటికి వెళ్లకుండా కార్మికులు నిలిపేవారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి నాయకులు మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతిచెందిన మున్సిపల్ కార్మికులకు రూ.పది లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల పట్ల వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్కే ఖాదర్‌వలి, చార్లెస్, వి.మార్క్, గరటయ్య, దస్తగిరి, రమణమ్మ, ఈశ్వరమ్మ, దానియేలు, ఏఐటీయూసీ నాయకులు నాసర్‌వలీ, రత్తయ్య పాల్గొన్నారు.

తాడోపేడో.!

(మొదటిపేజీ తరువాయి)

ఈ విషయం సూచనప్రాయంగా చర్చకు వచ్చినట్లు చెబుతున్నారు. అయితే తెలుగుదేశం జిల్లా నేతలు మాత్రం ఇలాంటి చర్చ జరగలేదని అంటున్నారు. వైసిపిలో టిక్కెట్టు రాదని తేలిన కొందరు సిట్టింగు ఎమ్మెల్యేలు కూడా తెలుగుదేశం వైపు చూస్తున్నారు. అవకాశాలను వెతుక్కుంటున్నారు. ఏదేమైనా ఈ చర్చలకు సోమవారం నాడు తెరపడుతుందా? లేదా? అనేదీ చూడాలి.

మూఢనమ్మకాలు..ప్రగతి నిరోధకాలు

(మొదటిపేజీ తరువాయి)

నిలిచాయి. ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల విభాగంలో మొదటి, రెండు, మూడు స్థానాలను గీతాంజలి హై స్కూల్, (పొదిలి), భాష్యం హై స్కూల్ (ఒంగోలు), కెవిఎన్ఎల్ హైస్కూల్, మరపగుంట్ల (వెలిగండ్ల మండలం) అదుకున్నాయి. తొలి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు, బహుమతులు అందజేసి విద్యార్థులను అభినందించారు.

9న ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-దర్శి

ఈ నెల 9న మహిళల కోసం సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముందస్తుగా ముగ్గుల పోటీలు సాయంత్రం 3గంటలకు దర్శి ప్రభుత్వ జూనియర్ కళాశాల జరుగుతాయని జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి తెలిపారు. ఈ పోటీలకు మహిళలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.


కబడ్డీ పోటీల్లో క్రీడాకారులు

పోటాపోటీగా కబడ్డీ పోటీలు

ప్రజాశక్తి-దర్శి

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోటీపోటాగా జరుగుతున్నాయి. మొత్తం రాష్ట్ర స్థాయిలో 16 టీమ్‌లు రాగా పురుషులలో తూర్పు గోదావరి, గుంటూరు ఫైనల్ చేరాయి. స్త్రీలలో శ్రీకాకుళం, గుంటూరు, విజయనగరం, కృష్ణ సెమీ ఫైనల్ ఆడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫైనల్ అయిన తరువాత బహుమతులు అందజేస్తామని శీలం శ్రీనివాసరెడ్డి, గర్నిపూడి స్టీవెన్ తెలిపారు.

సర్వాంగ సుందరంగా మామిడిపాలెం చెరువు

ఒడా చైర్మన్ మీనా కుమారి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న మీనా, జంకె

మామిడిపాలెం వద్ద ఉన్న ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దితున్నట్లు ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి తెలిపారు. ఒడా నిధులు రూ.1.30 కోట్లతో ఒకటో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు వద్ద చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డితో కలిసి ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఒడా చైర్మన్ మీనాకుమారి మాట్లాడుతూ ప్రజల ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని మామిడిపాలెం చెరువు వద్ద అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. వాకర్స్ ట్రాక్, చెరువు చుట్టూ మొక్కలు నాటడం, గ్రీనరీ అభివృద్ధి, ఫెన్సింగ్, జిమ్, యోగా ప్లాట్ ఫాం ఏర్పాటు చేశామని వివరించారు. పనులు తుదిదశలో ఉన్నాయని చెప్పారు. ఒడా నిధులతో నగరంలోని మరికొన్ని పార్కులను కూడా అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు గోలి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ-యుటిఎఫ్ ఆధ్వర్యంలో 'ప్రజ్ఞ వికాసం'

ప్రజాశక్తి-మార్కాపురం


పరీక్ష పత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

పదో తరగతి విద్యార్థులకు 'ప్రజ్ఞ వికాసం' పరీక్షను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షకు చెందిన పరీక్షా పత్రాలను జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మునగాల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి టెస్టులలో పాల్గొనడం వల్ల రానున్న పబ్లిక్ పరీక్షల్లో వచ్చే భయాందోళనలు తొలగిపోతాయన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రభాకర్, రాష్ట్ర కౌన్సిలర్ బి శ్రీరాములు, యుటిఎఫ్ నాయకులు వై పాపయ్య, పి వెంకటేశ్వర్లు, డి యలమందారెడ్డి, విసిహెచ్ వెంకటేశ్వర రెడ్డి, వి శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కె విజయ్, ఏనుగుల శివ, జన విజ్ఞాన వేదిక నాయకులు ఏనుగుల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐల ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ పరీక్షలు నిర్వహించారు. గిద్దలూరు సాయి చైతన్య డిగ్రీ కళాశాలలో మండల విద్యాశాఖ అధికారులు కావడి వెంకటేశ్వర్లు, జింక వెంకటేశ్వర్లు టాలెంట్ టెస్ట్ ప్రశ్నాపత్రాలు విడుదల చేసి టాలెంట్ టెస్టు పరీక్షలు నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు డి జీవన్ కుమార్ పర్యవేక్షణలో టాలెంట్ టెస్ట్ పరిక్షలు జరిగాయి. దాదాపుగా 400 మంది విద్యార్థులు పాల్గొని, పరీక్ష రాశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రంగస్వామి రెడ్డి, గిద్దలూరు డివిజన్ ఎస్ఎఫ్ఐ కమిటీ నాయకులు నారాయణ, తేజ, అంజన్, కుమార్, నవీన్, సుభాష్ పాల్గొన్నారు.

ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను పూర్తి చేయాలి: ఈఓఆర్‌డి

ప్రజాశక్తి-సంతనూతలపాడు


షెడ్లను పరిశీలిస్తున్న అధికారులు

అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌లను వెంటనే పూర్తి చేయాలని ఈఓఆర్‌డి జి రామకృష్ణ ఆదేశించారు. మండలంలోని మద్దులూరు గ్రామంలో బేస్మెంట్ లెవెల్‌లో నిర్మాణంలో ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి షెడ్డును ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఓఆర్డి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న ఎస్‌డబ్ల్యూపిసి షెడ్లను 15వ ఆర్థిక సంఘం నిధులతో వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఆ షెడ్ల మరమ్మతులు, ఫెన్సింగ్ తదితర పనులను పూర్తి చేసి వినియోగంలో తేవాలన్నారు. ఇంకా పూర్తికాని మండలంలోని బొడ్డువారిపాలెం, రుద్రవరం, గురవారెడ్డిపాలెం గ్రామాలలోని షెడ్లను వెంటనే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అసంపూర్తిగా ఉన్న షెడ్‌లను పూర్తి చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయతీ కార్యదర్శులదేనన్నారు. లేని యెడల పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ ఎం శైలజా అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కమల్ హాసన్ ఉన్నారు.

కలుపు మొక్కల నివారణ

ప్రజాశక్తి-సిఎస్ పురం



మందు పిచికారీ దృశ్యాలను వీక్షిస్తున్న విద్యార్థులు

సీఎస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో జాతీయ సేవాపథకంలో భాగంగా 5వ రోజు ఆదివారం కళాశాల ఆవరణలో కలుపు మొక్కలు నిర్మూలన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ కళాశాలలో 4వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కలుపు మొక్కల వలన ఆహార పంటలకు నష్టం జరగడాన్ని విద్యార్థులు వివరించడం జరిగింది. అనంతరం శీలంవారిపల్లి ప్రాథమిక పాఠశాలలో రంగులు వేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్ జనార్దన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీ అధ్యక్షులుగా షేక్ పీరా, కార్యదర్శిగా అన్వర్‌బాషా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా షేక్ పీరా మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ నాయకులు దేవండ్ల శ్రీనివాస్, టీసీహెచ్ చెన్నయ్య, కెవి కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి..

బేస్తవారిపేట మండలం నుంచి భారీగా చేరికలు

ప్రజాశక్తి-గిద్దలూరు

నియోజకవర్గంలో వైసీపీకి భారీ గండి పడింది. వైసీపీ అవలంబిస్తున్న వైఖరి కారణంగా ఇక ఆ పార్టీలో కొనసాగలేమని భావించి బేస్తవారిపేట మండల నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ చెంతన చేరుతున్నారు. ఒక ఆదివారం రోజునే దాదాపు 100 కుటుంబాలకు పైగా వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. బేస్తవారిపేట టౌన్ మాజీ సర్పంచ్, నూర్‌బాషా సంఘం అధ్యక్షులు దూదేకుల మాబు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు, నేకునాంబాద్ మాజీ సర్పంచ్ యమా సుహాసిని ఆధ్వర్యంలో 40 కుటుంబాలు, అలాగే చెట్టిచర్ల పంచాయతీకి చెందిన మాజీ సర్పంచులు తీగిరెడ్డి భూపాల్‌రెడ్డి, కందలూరు కొండారెడ్డి, ప్రసుత వైస్ సర్పంచ్ మాచర్ల భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ అశోక్‌రెడ్డి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో దూదేకుల బారాహిమాం, బనగానపల్లె బాబుసాహెబ్, సిద్ధయ్య, పెద్ద ఖాదర్, బొంతపల్లి ఖాదర్, కాశయ్య, పెద్ద ఖాసీమయ్య, దూదేకుల కాశయ్య, బత్తుల మహాలక్ష్మమ్మ, కొల్లపూరి సాలమ్మ, కొల్లాపూరి నాగరాజు, చింతల చిన్న వెంకటయ్య తదితరులు ఉన్నారు.

సిఎం జగన్ మనస్సు మార్చాలని ప్రార్థన

13వ రోజు కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె



ప్రార్థన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మనస్సు మార్చి తమ సమస్యలు పరిష్కారం చేసేలా చూడాలని మున్సిపల్ కార్మికులు ప్రార్థన చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారానికి 13వ రోజుకు చేరుకుంది. 13వ రోజు సమ్మెలో భాగంగా కార్మికులు నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ముఖ్యమంత్రి జగన్ మనస్సు మార్చాలని ప్రార్థన చేశారు. ఆయనకు మంచి బుద్ధిని ప్రసాదించి తమ సమస్యలు పరిష్కరించే విధంగా చూడాలని భగవంతుడిని వేడుకున్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం పట్ల ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని కోరారు. 13 రోజులుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు సమ్మె చేస్తుండటంతో నగరాలు, పట్టణాల్లో పారిశుధ్యం అస్తవ్యస్థంగా మారిందన్నారు. ప్రజారోగ్యం ప్రమాదంలోకి నెట్టబడుతోందన్నారు. ప్రజల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే మున్సిపల్ కార్మికుల కోర్కెలు నెరవేర్చి సమ్మెను విరమింపజేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, యూనియన్ నాయకులు కుమారి, లక్ష్మీకాంతం, కాకుమాను వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సిఐ రామ్‌నాయక్‌కు సన్మానం

ప్రజాశక్తి-పామూరు

నూతనంగా బాధ్యతలు చేపట్టిన సీఐ రామ్ నాయక్‌ను మండల టిడిపి నాయకులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండలంలోని టిడిపి నాయకులు ఆదివారం సిఐ రామ్ నాయక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, పామూరు టౌన్ ఫోర్ మెన్ కమిటీ మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు యారవ శ్రీనివాసరావు, ఎస్కే రహ్మతుల్ల, ఇర్రి కోటిరెడ్డి, ఎం రమణయ్య, తడికిమల్ల సుబ్బారావు, దేవరపు మాల్యాద్రి, శేషు, ఉపలపటి హరిబాబు, వెంకటేశ్వర్లు, బి సత్యం, కే రహమతుల్లా, షేక్ రఫీ పాల్గొన్నారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. ఆదివారం యర్రగొండపాలెం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన గురిజేపల్లి, బోయలపల్లి, సర్వాయపాలెం గ్రామాల క్లస్టర్, యూనిట్, బూత్, గ్రామ పార్టీ అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ ప్రజల్లోకి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ, భవిష్యత్ ప్రణాళికను విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా టిడిపిని గెలిపించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు చిట్టేల వెంగళరెడ్డి, కామేపల్లి వెంకటేశ్వర్లు, వేగినాటి శ్రీనివాస్, మంత్రూ నాయక్, తోటా మహేష్ నాయుడు, పాలడుగు వెంకట కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నగరంలో శనివారం జరిగిన 24 నేషనల్ స్కై మార్షల్ ఆర్ట్స్ పోటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున ప్రకాశం జిల్లా మార్కాపురం పట్టణానికి చెందిన ఎంఎస్ మార్షల్ ఆర్ట్స్ కరాటే స్కూల్ విద్యార్థులు 3 ఇండివిడ్యువల్ గోల్డ్ మెడల్స్, 3 గ్రూప్ గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్ రెండు బ్రాండ్ మెడల్స్ స్కూల్ చీఫ్ ఎగ్జామినర్ మారంరెడ్డి శ్రీనివాసులు సాధించారు. వివిధ విభాగాల్లో పలువురు విద్యార్థులు పతకాలు సాధించారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులను స్కై మార్షల్ ఆర్ట్స్ గ్రాండ్ మాస్టర్ మీర్ నజీర్ అహ్మద్ (కాశ్మీర్), ఆంధ్రప్రదేశ్ స్కై మార్షల్ ఆర్ట్స్ ప్రెసిడెంట్ ఇస్మాయిల్, స్కై మార్షల్ ఆర్ట్స్ జనరల్ సెక్రెటరీ షేక్ ఇబ్రహీం విద్యార్థులను అభినందించారు.

14న శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం


మాట్లాడుతున్న శిద్దా

ప్రజాశక్తి-చీమకుర్తి

ఈ నెల 14వ తేదీన కె అగ్రహారంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం జీర్ణోద్ధరణ ప్రధాన కైంకర్య పోషకులు, కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేతలు శిద్దా వెంకటేశ్వరరావు, శిద్దా సూర్యప్రకాశరావు, శిద్దా హనుమంతరావు తెలిపారు. ఆదివారం ఆలయంలో జరిగిన ధనుర్మాస కార్యక్రమాలలో పాల్గొని విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డిసెంబర్ 17 నుంచి జనవరి 15వ తేదీ వరకు నెల రోజులపాటు ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీన దీపోత్సవం,10వ తేదీన లక్ష తులసిపూజ, 11వ తేదీన గంగాళోత్సవం, 13వ తేదీన తిరుమంజనసేవ కార్యక్రమాలు,14వ తేదీన కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ కంపెనీస్, ఆపెల్ గ్రానైట్స్ వారి సారథ్యంలో గోదా తిరు కల్యాణం, ఊంజల సేవ, శ్రీవారి పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాత్రి రెండు భారీ విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కోలాటం, నాటకాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భారీగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 15వ తేదీ శ్రీవారి రథోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాలలో పాల్గొను ప్రజలకు చీమకుర్తి నుంచి ప్రతిరోజూ ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. 30 రోజులపాటు అన్నదానం కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శిద్దా హైమావతి, శిద్దా సూర్యకుమారి, శిద్దా జయశ్రీ, శిద్దా పుష్పలత, గుర్రం దామోదరరావు, గుర్రం హరి, కె వడ్డికాసులు, కోట బాలకృష్ణ, 40 మంది దంపతులు పాల్గొన్నారు.

14న చంద్రన్న సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ఈ నెల 14వ తేదీన చంద్రన్న సంక్రాంతి సంబరాలు జరుపతలపెట్టినట్లు మండల టీడీపీ తెలిపింది. నియోజకవర్గ స్థాయిలో చీమకుర్తి గ్రామంలోని ఎంఎన్ఆర్ అపార్ట్‌మెంట్స్ ఆవరణలో మహిళలకు ముగ్గులు మరియు కబడ్డీ పోటీలు జరుప తలపెట్టినట్లు టీడీపీ మండల కమిటీ తెలిపింది. ఈ సందర్భం పురస్కరించుకొని మండలములోని ప్రతి గ్రామంలో ఈ నెల 11, 12 తేదీలలో ముగ్గుల పోటీలు జరిపి ఆ పోటీలలో మొదటి, రెండవ బహుమతులు పొందిన వారిని నియోజకవర్గ స్థాయి పోటీలకు చీమకుర్తికి పంపించాలని తెలిపారు. మొదటి బహుమతిగా లక్ష రూపాయలు, రెండో బహుమతిగా 50 వేల రూపాయలు, మూడో బహుమతిగా 25 వేల రూపాయలు, పాల్గొన్న ప్రతి మహిళకు కన్సోలేషన్ బహుమతిగా ఒక చీర ఇస్తున్నట్లు తెలిపారు. కబడ్డీ పోటీలకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో బహుమతులుగా రూ.25,000, రూ.20,000. రూ.15,000, రూ.10,000, రూ.8,000, రూ.5,000 ఇస్తున్నట్లు తెలిపారు. కావున ప్రతి మహిళా ఈ పోటీలలో పాల్గొని జయప్రదం చేయవలసిందిగా కోరారు. వివరాలకు 9949879667 నెంబరులో సంప్రదించాలని కోరారు.



నల్లగుంట్లలో మూతపడిన ఎయిడెడ్ ఉన్నత పాఠశాల

ప్రభుత్వ పాఠశాలకు నోచని గ్రామం

ప్రజాశక్తి-కొమరోలు

ప్రకాశం జిల్లా కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ పిల్లల్ని చదివించుకునేందుకు దూర ప్రాంతాలకు పంపించవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో నల్లగుంట్ల గ్రామంలో ఒక ఎయిడెడ్ పాఠశాల ఉండేది. రెండు సంవత్సరాల నుంచి పాఠశాల మూతపడటంతో తల్లితండ్రులు చేసేది లేక ఆటోలలో ప్రమాదకరమైన పరిస్థితులలో పిల్లల్ని పాఠశాలలకు పంపుతున్నారు. ప్రస్తుతం తమ పిల్లలు చదవాలంటే కొమరోలు 8 కిలోమీటర్లు, గిద్దలూరు15 కిలోమీటర్లు, తాటిచెర్ల మోటు ఐదు కిలోమీటర్ల దూరం పంపించాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు తమ ఆవేదనను వెలిబుచ్చారు. తమ పంచాయతీ పరిధిలో ఐదు గ్రామాలు ఉన్నాయని, 200 మందికి పైగా చదువుకునే విద్యార్థులు ఉన్నారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. అధికారులు స్పందించి నల్లగుంట్ల గ్రామంలో ఓ ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


1987-88 బ్యాచ్ విద్యార్థులు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

విద్యార్థి దశలో మరపురాని జ్ఞాపకాలను నెమరు వేసుకునే ఆత్మీయ సమ్మేళనం ఎన్నటికీ మరువలేనిదని పలువురు పూర్వ విద్యార్థులు అన్నారు. గజ్జలకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987-88 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సుమారు 35 ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులంతా ఒకేచోట చేరి ఆత్మీయ పలకరింపులతో యోగక్షేమాలు తెలుసుకుంటూ ఆనందంగా గడిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ సంతోషంగా గడిపారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేద్దామంటూ తోటి విద్యార్థులకు ఉపయోగపడతా మంటూ తీర్మానాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాజీ ఎంపీపీ నారు నాగిరెడ్డి పూర్వ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిఎంసి ఛైర్మన్ సుధాకర్, విశ్రాంత ఉపాధ్యాయులు నారు నాసర్‌రెడ్డి, శివన్నారాయణ, పిచ్చయ్య, పూర్వ విద్యార్థులు పి బాలనర్సయ్య, శ్రీరాములు, చంద్రుడు, ఎన్ గాలిరెడ్డి, సాంబ, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, కోటేశ్వరరావు, యూనుస్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

మండలంలోని సీతారాంపురం గ్రామంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారని విషయం తెలుసుకున్న హనుమంతునిపాడు మండల ఎస్ఐ శివనాగరాజు ఆదివారం మెరుపు దాడి చేశారు. కళ్ళు సామ్యూల్ వద్ద నుంచి 8 బాటిళ్లు, యద్దనపూడి మహేష్ వద్ద నుంచి 9 బాటిళ్లు సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమ మద్యం అమ్ముతున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలి

పవన్‌కల్యాణ్‌ను కలిసిన జనసేన నేత అచ్చయ్య

ప్రజాశక్తి-పుల్లలచెరువు

జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను పుల్లలచెరువు పార్టీ మండల అధ్యక్షులు కొఠారి అచ్చయ్య మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జనసేన పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పవన్ కళ్యాణ్ సూచించినట్లు అచ్చయ్య తెలిపారు.

హరిదాసులకు కనిపించని ఆదరణ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

సంక్రాంతి పర్వదినం దగ్గర పడడంతో ప్రతియేటా హరిదాసులు గ్రామాల్లో పర్యటిస్తూ, పాటలు పాడుతూ భత్యం యాచిస్తుంటారు. ఇదే క్రమంలో అ ఏడాది కూడా హరిదాసులు పొట్ట చేతపట్టుకొని హరిదాసు వృత్తినే జీవనాధారంగా చేసుకొని గ్రామాల్లో పర్యటిస్తున్నారు. అయితే కాలం కలిసి రాక, పనులు దొరక్క, వలసలు పోతున్న క్రమంలో యర్రగొండపాలెం పట్టణంలోనూ హరిదాసుకు ఆదరణ కరువైంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వీధుల వెంట పాటలు పాడుకుంటూ తిరిగినా కూలి పాటు కూడా రావడం లేదని వెంకటన్న అనే హరిదాసు తెలిపారు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో హరిదాసు వృత్తినే మానుకోవాల్సి వస్తుందని తెలిపాడు. ఏది ఏమైనా ప్రాచీన కళలు, కళాకారులు రోజురోజుకూ కనుమరుగై పోతున్నారు.



ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జెవివి రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

అభ్యుదయ భావ చైతన్యం కోసం ప్రజాశక్తి పత్రికను చదవాలని జెవివి రాష్ట్ర నాయకులు కోట వెంకటరెడ్డి అన్నారు. మండలంలోని వెదుళ్ళ పల్లి చైతన్య వేదిక భవనంలో ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరించారు. నేటి కాలమాన పరిస్థితుల్లో ప్రజాశక్తిని అదరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మచ్చా సాహెబ్‌రెడ్డి, భోగిరెడ్డి శ్రీరాములు, అక్కల వెంకటేశ్వర్లు, కోట చినమీరారెడ్డి, అసాది జాన్‌రెడ్డి, షేక్ సుబాని, కె బ్రహ్మారెడ్డి, డీ లింకన్, షేక్ పీరాసాహెబ్, నాయుడు, నాగేశ్వరరావు, కె అక్కిరెడ్డి, రు బ్రహ్మం, పుల్లారెడ్డి, సుభాష్ చంద్ర, పృథ్విరాజు, రత్తయ్య, లోకేష్ పాల్గొన్నారు.



సర్వశిక్ష ఉద్యోగులకు యుటిఎఫ్ నేతల సంఘీబావం

ఉద్యోగులకు యుటిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి - బాపట్ల

సర్వ శిక్ష ఉద్యోగులు సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు కోరారు. సర్వ శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె 19వ రోజుకు చేరింది. ఉద్యోగుల సమ్మకు యుటిఎఫ్ సంఘీభావం తెలిపింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్స్ వెంటనే పరిష్కరించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో విద్యా శాఖలో అనేక పనులకు ఆటంకం ఏర్పడిందని అన్నారు. కార్యక్రమం లో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు జె వినయ్ కుమార్, కార్యదర్శి కెవిఎస్ఎన్ కోటేశ్వరరావు, కార్యదర్శి మద్దాల సురేష్, బాపట్ల, చుండూరు, కర్లపాలెం మండలాల నాయకులు రాజేష్, బి శివరామకృష్ణ, డి నన్నూరుయ్య, కె నాగరాజు, బివి సుబ్బారావు, బి ఏడుకొండలు, పేరం వెంకటేశ్వర్లు, సమగ్ర శిక్ష జిల్లా నాయకులు టి మాణిక్యరావు పాల్గొన్నారు.



గొట్టిపాటితో టిడిపి ఆస్ట్రేలియా ఇన్‌ఛార్జి వై వెంకటేష్

టిడిపి అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పంగులూరు

ఆస్ట్రేలియాలో టిడిపి అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆస్ట్రేలియా టిడిపి ఇంచార్జ్ యెనికపాటి వెంకటేష్ అన్నారు. ఆస్ట్రేలియాలో స్థిరపడిన ఆయన సంక్రాంతి పండుగ సందర్భంగా తన స్వగ్రామమైన తూర్పు కొప్పెరపాడు వచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్‌తో కొద్దిసేపు మాట్లాడారు. ఆస్ట్రేలియాలో ఉన్న తెలుగువారిలో టిడిపికి మద్దతు ఎక్కువగా ఉందని తెలిపారు. ఎపిలో పార్టీ అభివృద్ధికి తమ వంతు సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో అద్దంకితోపాటు రాష్ట్రంలో విజయ యాత్ర కొనసాగించాలని, చంద్రబాబు పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందే విధంగా చేయాలని కోరారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. ఇక్కడ టిడిపి అభివృద్ధికి ఆస్ట్రేలియా సహకారం ఎప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కరి వెంకట సుబ్బారావు, టిడిపి తూర్పు కొప్పెరపాడు ఏరియా కన్వీనర్ యెనికపాటి అశోక్ పాల్గొన్నారు.

నల్ల బెలూన్లతో అంగన్వాడీల నిరసన



నల్ల బెలూన్లతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



మార్టూరులో ఎస్మా జిఓ కాపీలు దగ్ధం చేస్తున్న అంగన్వాడీలు

ప్రజాశక్తి - రేపల్లె

ఎస్మా ప్రయోగించటాన్ని నిరసిస్తు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బెలూన్లతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం వర్తించదని అన్నారు. ప్రభుత్వం బెదిరింపులు మానుకొని సమస్యలు పరిష్కరించాలని సిఐటీయు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ డిమాండ్ చేశారు. బెదిరింపుల ద్వారా ఉద్యమాన్ని ఆపలేరని హెచ్చరించారు. ఎస్మా వెనక్కి తీసుకోవాలని, లేకుంటే కార్మిక సంఘాలుగా ప్రజాస్వామ్యవాదులు ప్రజలందరని కలుపుకొని పెద్ద ఎత్తున పోరాటం నిర్వహిస్తామని అన్నారు. 27వ రోజు సమ్మెలో బాగంగా అంబేద్కర్ విగ్రహం ముందు నల్ల బెలూన్లతో అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. అంగన్‌వాడీ యూనియన్ కార్యదర్శి కె వాణి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కారం చేయాలని సమ్మె చేస్తుంటే సమస్యల పరిష్కారం చేయకుండా జిఓ నెం2 తీసుకొచ్చి అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించడం చట్టవ్యతిరేకమని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె రత్నకుమారి, నిర్మలజ్యోతి, రాజ్యలక్ష్మి, లావణ్య, రజిని పాల్గొన్నారు.

సంతమాగులూరు : అంగన్‌వాడిల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె ఐసిడిఎస్ కార్యాలయం వద్ద 27వ రోజుకు చేరింది. స్థానిక సచివాలయం ముందు అంగన్‌వాడీలు నిరసనగా ఎస్మా జీఓ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్ బి, శ్రీదేవి, మల్లేశ్వరి, ఎస్తేరా రాణి, నిర్మల, ఆదెమ్మ, రమణ పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : అంగన్‌వాడీలపై వైసిపి ప్రభుత్వం ఎస్మా చట్టం ప్రయోగించడం సిగ్గుమాలిన చర్యని టిడిపి మహిళా మండలి అధ్యక్షురాలు ఉప్పుటూరి రమాదేవి అన్నారు. అంగన్‌వాడీ ఉద్యమం అణచివేత కోసమే తెచ్చిన జీఓ నంబర్2 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయం ఎదుట జనసేన నాయకులతో కలిసి జీఓ ప్రతులను దగ్ధం చేశారు.

చిన్నగంజాం : ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిర్బంధం ప్రయోగించడం మూర్ఖత్వం అవుతుందని సిఐటియు జిల్లా కార్యదర్శి జి ప్రతాప్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం నందు రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఎస్మా జీఓ కాపీలను దగ్ధం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పునరాలోన చేయాలని అన్నారు.

అద్దంకి : అంగన్‌వాడీల సమ్మెపై ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం ఇచ్చిన జిఓ నెం2 జారీ చేయడాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నెరుసులు వెంకటేశ్వర్లు, కంకణాల ఆంజనేయులు ఖండించారు. తక్షణమే జిఓ నెంబర్2ను ఉపసంహరించుకోవాలని కోరారు. ఎస్మా ప్రకటించడాన్ని ఖండిస్తూ గుంటూరులో జరుగుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర వర్క్ షాప్ సందర్భంగా నిరసన తెలిపారు.

కొల్లూరు : అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 27వ రోజు కూడా సమ్మె కొనసాగించారు. అంగన్‌వాడీల ఆందోళనలను అణచి వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా చట్టం జీఓ కాపీలను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బొనిగల సుబ్బారావు, అంగన్‌వాడి లీడర్స్ సౌభాగ్య, లక్ష్మి, భాగ్యం, పద్మ, కాశి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలపై తీసుకువచ్చిన ఎస్మ చట్టం రద్దు చేయాలని జిఓ ప్రతులను దగ్ధం చేశారు. స్థానిక వై జంక్షన్ నుండి నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. 9న జైల్ బరోకు వెళతామన్నారు. కార్యక్రమంలో సిఐటియు కార్యదర్శి నాగండ్ల వెంకట్రావు, ప్రాజెక్టు లీడర్లు బిక్కి సరళ, శ్రీలత, భారతి, లక్ష్మి, కుమారి, రమాదేవి, అంజమ్మ, రాజ్యలక్ష్మి, శ్రీదేవి, పద్మావతి పాల్గొన్నారు.

కారంచేడు : అంగన్‌వాడి ఉద్యమంపై ఎస్మా ప్రయోగించడం అసమర్థ చర్యని సిఐటియు జిల్లా నాయకులు పి కొండయ్య పేర్కొన్నారు. స్థానిక కాల్వ సెంటర్లో ప్రభుత్వం అంగన్‌వాడీలకు వ్యతిరేకంగా విడుదల చేసిన జీఓను దగ్ధం చేశారు. స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం నిరంకుశ వైఖరి మానుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడి నాయకులు శ్రీలక్ష్మి, క్రీస్తు రాజ్యం, కళ్యాణి, హఫీజ, శివ లీల, ఆదిలక్ష్మి, రాధా పాల్గొన్నారు.

చెరుకుపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తల ఆందోళనపై ప్రభుత్వం ప్రయోగించిన ఎస్మా చట్టం జీఓ కాపీలను కార్యకర్తలు ఆదివారం దగ్ధం చేశారు. చిరు ఉద్యోగుఐలన తమపై ఎస్మా చట్టం ప్రయోగించటం అవివేక చర్యని అన్నారు. ప్రతి ఒక్కరు ఖండించాలని కోరారు. సమస్యలు పరిష్కరించే దిశగా ఆలోచించాలని కోరారు.

మెదరమెట్ల : అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె 27వ రోజుకు చేరింది. కోరిసిపాడు మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఎస్మా జీఓ కాపీలను ఆదివారం తగలబెట్టారు. అంగన్‌వాడీల ఆందోళనకు టిడిపి కార్యకర్తలు, నాయకులు మద్దతు పలికారు. అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను ఖండించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు జాగర్లమూడి జయకృష్ణ, చెన్నుపాటి హరిబాబు, మేదరమెట్ల శ్రీనివాసరావు, నాదెండ్ల కోటేశ్వరరావు, గొల్లమూడి సురేందరరెడ్డి, కారుసాల గురుబాబు, సిఐటియు నాయకులు వై రవీంద్రబాబు, అంగన్‌వాడి కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : అంగనవాడీలు 27రోజులుగా సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరాహార దీక్షల్లో భాగంగా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్2 ఎస్మా పత్రాలను దగ్ధం చేశారు. భట్టిప్రోలు, వెల్లటూరు రహదారిలో పత్రాలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి సుధాకర్, నాగరాజు, సత్యనారాయణ, అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు రమాదేవి, గృహలక్ష్మి, సూర్య లక్ష్మీ పాల్గొన్నారు.

చీరాల : అంగన్‌వాడీ కార్యకర్తల నిరవధిక సమ్మె నిర్వహిస్తుంటే కార్మికుల సమస్యలపై చర్చించి సమస్య పరిష్కారం చేయాల్సిన ప్రభుత్వం బాధ్యత మరిచి బెదిరింపులకు పాల్పడటం అవివేకమని సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు అన్నారు. ఎస్మా ప్రయోగించి ఉద్యమాన్ని అణచాలని అనుకోవటం అవివేకమే అవుతుందని అన్నారు. ఎస్మా ప్రయోగిస్తూ విడుదల చేసిన జీఓ కాపీని దగ్ధం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సుజీవన, సులోచన, జ్యోతి, హనుమాయమ్మ పాల్గొన్నారు.



చిన్నగంజాంలో ఎస్మా జిఓ కాపీలు దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీ



చీరాలలో ఎస్మా జిఓ దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కార్మికుల పోరాటానికి గొట్టిపాటి మద్దతు



మున్సిపల్ కార్మికుల సమ్మెకు ఎంఎల్ఎ గొట్టిపాటి రవి మద్దతు

ప్రజాశక్తి - అద్దంకి

మున్సిపల్ కార్మికులకు ప్రతిపక్ష నేతగా జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మెకు ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సంఘీభావం తెలిపారు. 2019ఎన్నికలకు ముందు అసెంబ్లీలో, జగన్ తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయకుండా అందరిని మోసం చేశారని గొట్టిపాటి ఆరోపించారు. డిమాండ్ల పరిష్కారం కోసం రోడ్లెక్కి నిరసన తెలపాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మెకు టీడీపీ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలు పాటించాలని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు. అధికారానికి వచ్చిన 6నెలల్లోనే కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ అమలు నోచుకోక పోవడం మోసం చేయడం కాదాని ప్రశ్నించారు. పట్టణ విస్తీర్ణం, జనాభా పెరుగుదల దృష్యా కార్మికుల సంఖ్యను పెంచాలని, కరోనా సమయంలో తీసుకున్న అదనపు సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా నిర్బంధం ప్రయోగించాలనుకుంటే ఫలితం అనుభవిస్తారని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ గంగయ్య హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

చీరాల : ఎన్నికలకు ముందు హామీలు ఇచ్చి అధికారం వచ్చాక వాటిని గాలికి వదిలేసి నిర్లక్ష్యంగా జగన్ వ్యవహరిస్తున్నారని సీఐటీయు అధ్యక్షులు ఎన్ బాబురావు అన్నారు. మునిసిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 13వ రోజుకు చేరుకుంది. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కార్పొరేట్ సేవలో ఉన్నారని అన్నారు. మరో సారి గెలవాలనే లక్ష్యంతో ఎన్నికల వ్యూహాలు రచించే పనిలోవున్నారని అన్నారు. పెట్టుబడిదారులకు రూ.వేల కోట్లు రాయితీలు ఇచ్చిన ప్రభుత్వం కార్మికుల జీతాలు పెంచేందుకు డబ్బులు లేవనడం విడ్డూరంగా ఉందని అన్నారు. ప్రజల గోళ్లు ఊడగొట్టి పన్నులు వసూలు చేస్తున్న ప్రభుత్వ కార్మికుల జీతాలు ఎందుకు పెంచదని ప్రశ్నించారు. కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటీయు, యూనియన్ నాయకులు పలువురు పాల్గొన్నారు.



కార్మికుల సమ్మె శిబిరంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు

ఎస్మాపై నిరసనాగ్రహం

- జీవో 2 ప్రతులు దహనం
- 27వ రోజు కొనసాగిన అంగన్వాడీల సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంగన్‌వాడీ ఉద్యమాన్ని అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఇందులో భాగంగా జీవో నెంబర్ 2ను విడుదల చేసిందని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు విమర్శించారు. ఎస్మా చట్టాన్ని ప్రయోగించ డాన్ని ఖండిస్తూ ఒంగోలు అద్దంకి బస్టాండ్ సెంటర్లో కేంద్ర కార్మిక సంఘాలు, సిఐటియు ఏఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో ఆదివారం జీవో నెంబర్ 2 ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ ఉద్యమంపై ఉక్కు పాదం మోపేందుకు ప్రభుత్వం జీవో నెంబర్ 2ను విడుదల చేసిందన్నారు. గత 27 రోజుల నుంచి నిరవధికంగా 1,06,000 మంది సమ్మె చేస్తుంటే రెండు మూడుసార్లు చర్చలు జరిపినప్పటికీ పురోగతి లేదన్నారు. ఉద్యమాన్ని నీరుగార్చటానికి, సమ్మెను విరమింప చేయడానికి రకరకాల ప్రయత్నాలు ప్రభుత్వం చేసిందన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి ఆర్ మోహన్, ఏఐటియుసి నాయకులు పివిఆర్ చౌదరి, ఎస్‌డి సర్దార్, హరినారాయణ, ఆటో వర్కర్ సీనియర్ నాయకులు మహమ్మద్ బేగ్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడండి: యుటిఎఫ్

అంగన్‌వాడీ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎపి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద జరుగుతున్న నిరవధిక సమ్మె 27వ రోజుకు చేరుకుంది. దీక్షలలో కూర్చొన్న వారికి యుటిఎఫ్ నాయకులు పూలమాలలు వేసి ప్రారంభించారు. కార్యక్రమం లో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డి వీరాంజనేయులు, సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివిఆర్ చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, అంగన్వాడీ నాయకులు ధనలక్ష్మి, కల్పన, కెవి సుబ్బమ్మ, యుటిఎఫ్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అంగన్వాడీలు తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని చేస్తున్న సమ్మె 27వ రోజు కొనసాగింది. గిద్దలూరు శాసనసభ్యులు అన్నా వెంకట రాంబాబు జోక్యం చేసుకొని ముఖ్యమంత్రితో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరిం చాలని కోరుతూ ఎమ్మెల్యేకు అర్జీ సమర్పించారు. ఆయన స్పందిస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కారం కోసం ప్రయత్నం చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి ఆవులయ్య, బి నరసింహులు, యూనియన్ నాయకురాలు డి స్వర్ణ, మున్నా, వరలక్ష్మి, రమణమ్మ, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కంభం: స్థానిక కందులాపురం సెంటర్లో ఏర్పాటు చేసిన అంగన్వాడీ దీక్ష శిబిరంలో 27వ రోజు సమ్మెను కొనసాగిం చారు. జీవో-2ను రద్దు చేయాలని, ఎస్మాను ఎత్తివేయాలని అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నినాదాలు చేశారు. ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలపై ఏకపక్ష నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్మాను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కందులాపురం సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జీవో-2ను రద్దు చేయాలంటూ జీవో ప్రతులను కాల్చి వేశారు. ఈ కార్యక్రమంలో మండల సిఐటియు కన్వీనర్ షేక్ అన్వర్‌బాషా, సిపిఎం నాయకులు దానం, సిఐటియు నాయకులు వెంకట్ మూడు మండలాల అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, ఆదిలక్ష్మి, స్వర్ణలత, అంగన్వాడీ ఆయాలు పాల్గొన్నారు.

కనిగిరి: కనిగిరి పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన నిరసన ఆదివారం 27వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం జారీ చేసిన ఎస్మా చట్టం జీవోలను ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు దహనం చేసి నిరసన తెలియజేశారు. నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్వాడీల వేతనాల పెంపుదలతో పాటు సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతానని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయకపోవడం సరికాదని, వెంటనే హామీలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, రాజేశ్వరి, సౌందర్య, రామ సుబ్బులు, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, ఐద్వా నాయకులు ఎస్‌కే బషీర, శాంతకుమారి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సిఐటియు నాయకులు పల్లాపల్లి ఆంజనేయులు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన మద్దిపాడులో అంగన్వాడీలు చేస్తున్న దీక్షలు ఆదివారం 27వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా అంగన్వాడీలు 27 నెంబర్ ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం దిగివచ్చే వరకు తమ పోరాటం ఆగదని అన్నారు. ఇప్పటికే అంగన్వాడీలను చూసి ప్రభుత్వానికి వణుకు వచ్చిందని, అందులో భాగంగానే ఎస్మాను ప్రయోగించింద న్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమ్మెలో సిఐటియు నాయకులు ఆదిలక్ష్మి, అంగన్వాడీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

టంగుటూరు: అంగన్వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అంగన్వాడీ యూనియన్ నాయకురాలు కె హేమలత డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమస్యలపై కొనసాగిస్తున్న సమ్మె 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జరిగిన నిరసనలో భాగంగా టంగుటూరు అంగన్వాడీ ప్రాజెక్ట్ వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఐసీడీఎస్ ఆఫీస్ దగ్గర నుంచి బొమ్మల సెంటర్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఓ నెంబర్-2 ఎస్మా చట్టం కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు టంగుటూరి రాము, వేశపోగు మోజెస్, అంగన్వాడీ యూనియన్ నాయకులు బి శేషమ్మ, పి క్రాంతి, సుభాషిణి, బి జ్యోతి, వై విజయ, డి సునీత, ఆషా తదితరులు పాల్గొన్నారు.

నాగులుప్పలపాడు: అంగన్‌వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గత 27రోజుల నుంచి చేస్తున్న నిరవధిక సమ్మెపై ప్రభుత్వం ఎస్మా ప్రకటించడం సరైన పద్ధతికాదని యుటిఎఫ్ నాయకులు పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని అడగడం కూడా నేరమని వారిపై నిర్బంధాలు విధించడం, బెదిరింపులకు గురిచేయడం, చులకనగా మాట్లాడం దుర్మార్గమైన చర్య అని రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జె జయంతిబాబు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రైతు, కౌలు రైతు సంఘాలు, యుటిఎఫ్ మండల, జిల్లా నాయకులు మద్దతు తెలిపి కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీకాంత్, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వెంకట సుబ్బమ్మ, దుర్గాభవానీ, రజనీ, ప్రమీల, రమాదేవి, ముత్యాలమ్మ, వివిధ గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

దర్శి: అంగన్‌వాడీల ఎస్మా చట్టాన్ని వ్యతిరేకిస్తూ దర్శి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద 27వ రోజున సమ్మె కొనసాగించి అంగన్‌వాడీలు ఉరి వేసుకుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీల నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పుట్లూరి కొండారెడ్డి, నాయకులు ఏసు, కొండగురవయ్య, కోటేశ్వరరావులు మద్దతు తెలిపి ప్రసంగించారు. సమ్మె న్యాయమైందని, నిషేధించే హక్కు ఏ ప్రభుత్వానికి లేదని కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. యూనియన్ ఉపాధ్యక్షురాలు నాగజ్యోతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పట్టించుకోకుండా ఎస్మా చట్టాన్ని పెట్టడం అన్యాయమని, 9వ తేదీ విధుల్లో చేరకపోతే ప్రభుత్వం బెదిరించడం, వైసీపీ దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. సమ్మె కొనసాగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాండవ రంగారావు, సందు వెంకటేశ్వరరావు, అచ్చమాంబ, మోహన్‌రావు, సుజాత, తిరుపతమ్మ, ప్రశాంతి, మల్లేశ్వరి, నాగలక్ష్మి, బాలమ్మ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: గత 27 రోజులుగా అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోగా కక్ష సాధింపు చర్యలకు దిగడం మానుకోవాలని సిఐటియూ, ఏఐటియూ నాయకులు కోరారు. ఆదివారం యర్రగొండపాలెంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె దీక్షలకు వారు మద్దతు తెలిపారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు మల్లేశ్వరి, పి సుభాషిణి, ఎ నాగ మల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బలు, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరింది. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు షేక్ ముంతాజ్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, భారతి, ధనలక్ష్మి, మేరికుమారి, కాశీశ్వరి తదితరులు పాల్గొన్నారు.





గిద్దలూరులో ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు అర్జీ ఇస్తున్న అంగన్వాడీలు, కంభంలో ఉయ్యాలలో చిన్న పాపతో నిరసన తెలుపుతున్న అంగన్వాడీ కార్యకర్తలు



నిరసనలో చిన్నారి







దర్శిలో ఉరి వేసుకుంటూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు, ఒంగోలులో జీవో2ను తగులబెడుతున్న సిఐటియు నాయకులు, కనిగిరిలో జీవో కాపీలను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్థానిక డిఆర్ఎంఎం మున్సిపల్ హై స్కూల్‌లో 1974లో పదోతరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా ఆనాటి ఉపాధ్యాయులు సైన్స్ టీచర్ రామ్మోహన్రావు, ఇంగ్లీష్ టీచర్ కే.కోటేశ్వరరావు, క్రాఫ్ట్ మాస్టర్ పి నాగేశ్వరరావు హాజరయ్యారు. పాఠశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని నిర్ణయించారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

కొనసాగుతున్న సమ్మె

ప్రజాశక్తి-పామూరు

చిరు ఉద్యోగులపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అన్యాయమని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి అన్నారు. అంగన్వాడీలో చేస్తున్న సమ్మె 27వ రోజుకు చేరిన సందర్భంగా సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ అంగనవాడిలు 26 రోజులుగా సమ్మె చేస్తున్న సమస్యలు పరిష్కరించకుండా చేతగాని ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ఎస్మా ప్రయోగించడం కార్మికులను బెదిరించడం సబబు కాదన్నారు. బెదిరింపులకు అంగన్వాడీలు తలొగ్గరని, సమస్యలు డిమాండ్స్ పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగుతుందని అన్నారు. అంగన్వాడీల సమ్మెకు అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మద్దతు తెలిపింది. పోరాటం విజయవంతం అయ్యేంతవరకు పోరాడాలని, అందుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కార్యదర్శి షేక్ ఖదర్ నిషా తెలిపారు. జీవో2 ఎస్మా కాపీలను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ రమిజ, మదారమ్మ, సీఐటీయూ నాయకులు షేక్ అల్లాభక్ష, దేవయ్య, అంగనవాడీ టీచర్లు ఆయాలు తదితరులు పాల్గొన్నారు

'ఎస్మా' ప్రయోగం అప్రజాస్వామిక చర్య

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కొండారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం



న్యాయ సమ్మతమైన డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగించడం అప్రజాస్వామిక చర్య అని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి పేర్కొన్నారు. మార్కాపురంలో ఆదివారం ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. వేతన పెంపుదల, గ్రాట్యూటీ అమలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర 12 డిమాండ్లపై గత మూడు సంవత్సరాల నుంచి వివిధ సందర్భాల్లో ఉద్యమాలు నిర్వహించినట్లు తెలిపారు. అనేకసార్లు అధికారులకు, ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో ముందుగా నోటీసు ఇచ్చి సమ్మెకు వెళ్తామని అంగన్‌వాడీలు తెలిపారు. ప్రభుత్వం చర్చల పేరుతో కాలయాపన చేసిందన్నారు. గత్యంతరం లేకనే డిసెంబర్ 12 నుంచి అంగన్‌వాడీలు నిరవధిక సమ్మెకు పూనుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్ల నిర్వహణ పేరుతో అంగన్‌వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సెంటర్లను నిర్వహించాలని చూసింది. కానీ పిల్లలు, బాలింతలు, గర్భిణులు ఎవరూ సెంటర్లకు రాలేదు. దీంతో ప్రభుత్వం ఏమీ చేయలేక అంగన్వాడీ సెంటర్ల తాళాలు తాము పగలగొట్టలేదని ప్రకటించింది. ముందుగా నోటీసు ఇచ్చి చేసిన సమ్మె చట్టపరమైన సమ్మె అన్నారు. విధుల్లో ఉన్న ఉద్యోగులు, కార్మికులను తొలగించడానికి కారణాలు చెప్పకుండా, సంజాయిషీ నోటీసులు ఇవ్వకుండా, సమాధానం తీసుకోకుండా విధుల నుంచి తొలగించకూడదని కార్మిక చట్టాలు సూచిస్తున్నాయి. డిమాండ్ల పరిష్కారం అయ్యేంత వరకు అంగన్‌వాడీలు పట్టుదలతో పోరాటాలు నిర్వహించాలని కోరుతున్నామన్నారు.



సమావేశంలో ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షులు షేక్ అబ్దుల్‌రషీద్

ముస్లిములకు ప్రాతినిధ్యం ఇవ్వాలి

ప్రజాశక్తి - బాపట్ల

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బాపట్ల అసెంబ్లీ సీటు ముస్లింలకు కేటాయించాలని నియోజకవర్గ ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ రషీద్ కోరారు. పట్టణంలో ఇస్లాంపేటలో ముస్లిం సోదరులతో కలిసి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో ముస్లింలకు ప్రాధాన్యత ఇచ్చే పార్టీకే ముస్లింల మద్దతు ఉంటుందని తెలిపారు. మైనార్టీల శ్రేయస్సు కోరే పార్టీలకు తమ రాజకీయ సహాయ, సహకారాలు అందిస్తామని అన్నారు. నియోజకవర్గంలోని బాపట్ల, పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు ఓటములు తేల్చగలిగే ముస్లింలకు ఏదో ఒక రాజకీయ పార్టీ అసెంబ్లీ టికెట్ ముస్లింలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పఠాన్ రాజేష్, భాష, షేక్ జిలాని, ముస్లిం నాయకులు, యువకులు పాల్గొన్నారు.



మోడల్ పరీక్ష నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - చీమకుర్తి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన 10వ తరగతి మోడల్ పరీక్ష (ప్రజ్ఞ వికాసం) విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యూటిఎఫ్ సహకారంతో పట్టణంలో రెండు కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు 200మంది విద్యార్థులు హాజరైనారు. ఈ సంధర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జి దేవరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు మోడల్ పరీక్షలలో పాల్గొనడం వలన పబ్లిక్ పరీక్షలంటే భయం దూరం చేయవచ్చని అన్నారు. కార్యక్రమంలో యూటిఎఫ్ నాయకులు ఎస్కె అక్బర్, పర్వతం వెంకటేశ్వర్లు, బి బ్రహ్మయ్య, ఎస్కె కరీముల్లా, జగదీష్, రామాంజి, కిషోర్ పాల్గొన్నారు.



గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎం అయ్యపరెడ్డి

ఎస్‌డబ్ల్యూఎఫ్ గేట్ మీటింగ్

ప్రజాశక్తి - అద్దంకి

స్థానిక ఆర్టీసీ డిపో నందు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం రవాణా రంగంలో కొత్తగా తీసుకొని వచ్చిన నూతన చట్టాలు రద్దు చేయాలని కోరుతూ ఆదివారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఎస్డబ్ల్యూఎఫ్ నాయకులు మాట్లాడుతూ నూతన చట్టం ద్వారా భారతదేశంలో ఎవరు కూడా డ్రైవర్ వృత్తిలోనికి రాని విధంగా ఉన్నాయని అన్నారు. ఈ నూతన చట్టం ద్వారా యాక్సిడెంట్ జరిగిన సందర్భంలో డ్రైవర్‌కు రూ.10లక్షలు జరిమానా, పది సంవత్సరాలు జైలు శిక్ష ఉండేవిధంగా ఉందని అన్నారు. ఈ నూతన రవాణా చట్టంను పార్లమెంటులో ఆమోదించారని అన్నారు. ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం అయ్యప్పరెడ్డి, ఎస్‌డబ్ల్యుఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

తనికెళ్ల భరణికి జీవిత సాఫల్య పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి

పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మ జీవిత సాఫల్య పురస్కార సభకు డివిఎం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. తన నటనతో అందరి మనసుల్లో నిలిచే పాత్రలు చేశారని అన్నారు. బాలభార్గవి ప్రార్ధనా గీతంతో సభ ప్రారంభించారు. పుట్టంరాజు తాండవకృష్ణ పురస్కార గ్రహీత తనికెళ్ల భరణిని సభకు పరిచయం చేశారు. తనికెళ్ల భరణి సాహిత్యాన్ని ఆర్‌వి రాఘవరావు విశ్లేషించారు. తనికెళ్ల భరణి నటించిన చలన చిత్రాల్లో పాత్రల్లో పండించిన హాస్యాన్ని, విలనిజాన్ని సినీ విశ్లేషకుడు వారణాశి రఘురామశర్మ వివరించారు. ఎర్రన నడచిన అద్దంకి సీమలోని ప్రతి రేణువు శివమయమని, తెలుగు భాష ఓనమాలు దిద్దుకున్ననేలపై పురస్కార అందుకోవడం అదృష్టంగా భావిస్తున్నానని పురస్కార గ్రహీత తనికెళ్ల భరణి అన్నారు. ట్రస్టు అధ్యక్షుడు పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, శైలజ, కుటుంబ సభ్యులు పుట్టంరాజు చక్రధర్, తాండవకృష్ణ, నంబూరి హనుమంతరావు, బాలభార్గవి పురస్కార ద్రవ్యం



సినీ నటులు తనికెళ్ల భరణికి సత్కారం

రూ.20వేలు, పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి రుద్రయ్య, మురళీ సుధాకరరావు, కెవి పోలిరెడ్డి, చప్పిడి వీరయ్య, మలాది శ్రీనివాసరావు, జమ్మలమడక హనుమంతరావు, వామరాజు వెంకటేశ్వర్లు, ఓరుగంటి ప్రసాదరావు, లక్కరాజు విశ్వమోహన్, కొండకావూరి కుమార్, ఓరుగంటి శ్రీనివాసరావు, మిట్టా కామేశ్వరశర్మ, అద్దంకి లెవీప్రసాదు, సందిరెడ్డి శ్రీనివాసరావు, కుందా సుబ్బారావు, గోపినాథం హరనాథ్, పసుపులేటి ఆంజనేయులు పాల్గొన్నారు.

ముమ్మరంగా శనగ సాగు

ప్రజాశక్తి - పర్చూరు

రబీలో సెనగ సాగు ముమ్మరంగా వేస్తున్నారు. తుఫాను కారణంగా అదను దాటిపోతుండడంతో త్వరగా విత్తనాలు వెదబెట్టేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ఆలస్యం కావడంతో దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. నవంబర్ 15నుంచి డిసెంబర్ 15వరకు శనగ సాగుకు అనుకూలమని శాస్త్రవేత్తలు చెప్పారు. ప్రతి సంవత్సరం ఇలాగే విత్తనాలు ఎదపెడతారు. ఈ ఏడాది తుఫాను వల్ల అదనులో విత్తనాలు వెదపెట్టలేకపోయారు. పొలాలన్నీ వరద ముంపుకు గురి కావడం, ముందుగా వేసిన పైరు దెబ్బతినడంతో మళ్లీ వేయాల్సిన పరిస్థితి తలెత్తింది. గతంలో జేజి లెవెన్, కాక్టు రకాలు అధికంగా సాగు చేసేవారు. ఈ సంవత్సరం వాటితో పాటు ఫూల్ రకం వైపు మగ్గుచూపుతున్నారు. గత ఏడాది ఈ రకం సాగు చేసిన భూముల్లో అధిక



భూమిని శనగసాగుకు సిద్ధం చేస్తున్న రైతులు

దిగుబడి రావటంతో ఆసక్తి చూపుతున్నా రు. జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోనే శనగ అత్యధికంగా సాగవుతుంది. పర్చూరు పరిధిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. తుఫాను కారణంగా సెనగ కోసం సిద్ధం చేసిన భూముల్లో అదను దాటిపోతుందనే కారణంతో చాలా మంది రైతులు వైట్ బర్లీ పొగాకు మొక్కలు నాటారు. పొగాకు దెబ్బతిని పీకేసిన భూముల్లో అక్కడ కూడా సెనగ సాగు చేస్తున్నారు. దీనివల్ల ఈ ఏడాది శనగ సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తుంది. గత సంవత్సరం సాధారణ విస్తీర్ణం 84109 కాగా 94258 ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఏడాది రబీలో సాధారణ సాగు విస్తీర్ణం 79434 ఎకరాలుగా వ్యవసాయ శాఖ అంచనా వేసింది. తుఫాను పరిస్థితులు కారణంగా ఇంకా సాగు పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

టిడిపి ద్వారానే ముస్లిముల అభివృద్ధి

కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

ప్రజాశక్తి - శింగరాయకొండ

ముస్లిం మైనార్టీల అభివద్ధి కోసం టిడిపి అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలోనే జరిగిందని కొండేపి ఎంఎల్ఏ డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి అన్నారు. స్థానిక బుంగబావి సెంటర్ వీధిలో ఈద్గమీట్ట ప్రాంతంలో బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమ ఆదివారం నిర్వహించారు. ముస్లిం మైనార్టీల నివాసాలకు వెళ్లి టిడిపి మేనిఫెస్టో ప్రతి ఇంటికి వెళ్లఇ వివరిస్తూ వారితో మాట్లాడారు. టిడిపి ప్రభుత్వంలోని ముస్లిం మైనార్టీ నివాసమున్నా ప్రాంతంలో అండర్ డ్రైనేజీ ద్వారా రోడ్డు నిర్మాణం చేపట్టామన్నారు. రామతీర్థం నుంచి సాగర్ నీరు అందించిన ఘనత టిడిపిదని అన్నారు. అభివద్ధి అనేది టిడిపితోనే సాధ్యమవుతుందని అన్నారు. మోసాలు చేసే జగన్మోహన్‌రెడ్డిని ముస్లిం మైనార్టీలు నమ్మవద్దని సూచించారు. ఈపాటికే మోసం చేసిన ఘనత జగన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏ పండగ వచ్చిన టిడిపి ప్రభుత్వం ఉచితంగా రంజాన్‌తోప, సంక్రాంతి కానుక, క్రిస్మస్ లాంటి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ స్వామి

పండుగలు కూడా ఉచితంగా సరుకులు ఇస్తే అవి పేదలకు ఎంతో ఉపయోగపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, షేక్ సంధానిభాష, వేల్పుల సింగయ్య, చీమకుర్తి కష్ణ, కూనపురెడ్డి వెంకటసుబ్బారావు, టిడిపి మహిళా నాయకురాలు షేక్ రసూల్ బి, పులి ప్రసాదు, మించల బ్రహ్మయ్య, తెలుగు యువత అధ్యక్షులు షేక్ సనావుల్లా, సుదర్శి ప్రసాదరావు, శీలం చంటి, కల్లగుంట నరసింహ, పసుపులేటి శేషారావు, షేక్ యస్దాని, షేక్ బచ్చే పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - శింగరాయకొండ

స్థఆనిక శ్రీ చైతన్య టెక్నో స్కూల్ నందు విజయవాడ విజిర్ డయాబెటిస్ ఎడ్యుకేషన్ అవేర్నెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు 390మంది పాల్గొనగా అందులో 12మంది విద్యార్థులు



సర్టిఫికెట్‌లు ఇస్తున్నా ఉపాధ్యాయులు

అత్యంత ప్రతిభ కనపరిచారు. మొదటి మూడు స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మణ్ వాళ్ళను అభినందించి మెమెంటో, ప్రశంసా పత్రం అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ శ్రీనివాసరావు, ఏఒ మధు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న డాక్టర్ స్వామి

తెలుగుదేశంలో చేరిక

ప్రజాశక్తి - శింగరాయకొండ

పట్టణంలోనీ ఎస్కె ఖాజాహుస్సేన్, ఎస్కె మస్తాన్, ఎస్కె ఖాదర్‌బాషా, ఎస్కె బాజీ, ఎస్కె ఆబిద్, వీరికి చెందిన పది కుటుంబాలుకొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి సమక్షంలో ఆదివారం టిడిపిలో చేరారు. వారికి పసుపు కండువా కప్పి పార్టీలోనికి ఆహ్వానించారు. రానున్న శాసనసభ ఎన్నికల్లో పట్టణంలోని ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పని చేసి టిడిపికి మంచి మెజార్టీ తీసుకురావాలని కోరారు. మీరు వెంట టిడిపి సీనియర్ నాయకులు మందలపు గాంధీ చౌదరి, షేక్ మాభాష ఉన్నారు.



బిసి సంక్షేమ సంఘం కమిటీలను నిమిస్తున్న శ్రీనివాసాచారి

బీసీలు ఐక్యం కావాలి

ప్రజాశక్తి- పంగులూరు

బీసీలు రాజ్యాధికారం దిశగా ఐక్యం చేసేందుకు బీసీ సంక్షేమ సంఘం పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఫణితపు శ్రీనివాసాచారి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం జరిగిన బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా గోలి పూర్ణచంద్ర రావు, మండల అధ్యక్షుడుగా కడియం శివయ్య, ప్రధాన కార్యదర్శిగా కందుల రామారావు, ఉపాధ్యక్షులుగా ఉల్లగంటి వలి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కందుకూరు మల్లికార్జున, యువజన విభాగం అధ్యక్షులుగా పల్లపు గోపిని నియమిస్తూ పత్రాలను అందజేశారు.



సమావేశమైన ఇండియా కూటమి జిల్లా ప్రతినిధులు

బిజెపి ఓటమే 'ఇండియా' లక్ష్యం

ప్రజాశక్తి - బాపట్ల

కేంద్రంలో బిజెపిని ఓడించడమే ఇండియా కూటమి ప్రధాన లక్ష్యమని సమాజవాది పార్టీ జిల్లా అధ్యక్షులు మేధా శ్రీనివాసరావు అన్నారు. ఇండియా కూటమి జిల్లా శాఖ తొలి సమావేశం పట్టణంలో ఆదివారం నిర్వహించారు. బిజెపిని అంతం చేయాల్సిన పరిస్థితులను ప్రజలను గుర్తించాలని కోరారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాజేష్ పఠాన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి అరాచకాలు సృష్టిస్తూ, కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతుందని అన్నారు. జేబీ శ్రీధర్, కనకారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు సాగర్, సమాజవాది పార్టీ నాయకులు మోర్ల చిన్న వెంకటేశ్వరరావు, లంబు సాంబయ్య, దర్శి భాస్కరరావు పాల్గొన్నారు.

బాలసుబ్రమణ్యం జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మద్దిపాడు

మండలంలోని వెల్లంపల్లి ఆవాస్ హెూటల్ నందు జనసేన మండల అధ్యక్షులు బాలసుబ్రమణ్యం జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ్‌కుమార్, రాష్ట్ర క్రియాశీలక సభ్యుల శిక్షణా చైర్మన్ ఈదర హరిబాబు, రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, ఆమంచి రాజేంద్ర, వినుకొండ నియోజకవర్గ నాయకులు నిస్సంకరరావు, శ్రీనివాసరావు, అద్దంకి నియోజకవర్గ నాయకులు కంచర్ల శ్రీకష్ణ, సంతనూతలపాడు నియోజకవర్గ సమన్వయకర్త కందుకూరి బాబు, సంతనూతలపాడు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ బిఎన్ విజయ్‌కుమార్ హాజరై పుష్పగుచ్ఛంతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఒంగోలు 38వ కార్పొరేటర్ మాలగా రమేష్, జనసేన జిల్లా కార్యదర్శి చల్లాకష్ణ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల నిర్మాణం వేగవంతం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైపిపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. పరిపాలనను ప్రజలకు చేరువ చేసింది. వీటి నిర్వహణకు రూ.లక్షలు వెచ్చించి సచివాలయ కార్యాలయ భవనాల నిర్మాణం చేపట్టింది. చేపట్టిన భవనాలు పూర్తిస్థాయిలో ఐలవరం మండలంలో నిర్మించారు. 11గ్రామ సచివాలయలు ఉండగా వాటిలో ఐలవరం, సురేపల్లి, కోనేటిపురం గ్రామాల్లో మాత్రమే పూర్తి చేసుకున్నాయి. వీటితోపాటు మంజూరైన రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ సెంటర్ల నిర్మాణాలు, పెదలంక సచివాలయ పరిధిలోని రైతు భరోసా కేంద్రం ఈపాటికే ప్రారంభించారు. ఐలవరం గ్రామంలో మంజూరైన రెండు సచివాలయ భవనాలు, వైద్యశాల పూర్తి చేసుకోగా సచివాలయం2 ప్రారంభోత్సవం చేసుకుని కార్యకలాపాలు నిర్వహిస్తుంది. ప్రస్తుతం సచివాలయం1, వెల్నెస్ సెంటర్ ప్రారంభోత్సవాన్ని సిద్ధంగా ఉన్నాయి. రైతుభరోసా కేంద్రం నిర్మాణ దశలో ఉంది. ఐలవరం గ్రామానికి సచివాలయం1కు రు.43లక్షలు, సచివాలయం2కు రు.40లక్షలు, వెల్నెస్ సెంటర్‌కు రు.20.5లక్షలు, రైతుభరోసా కేంద్రంకు రు.17.5లక్షలు నిధులు మంజూరు చేశారు. మొత్తం రూ.1.20కోట్లతో భవనాలు నిర్మించినట్లు సర్పంచ్ మాచర్ల కోటేశ్వరరావు తెలిపారు. రు.96 లక్షలతో గ్రామంలో 23సిసి రహదారులు నిర్మాణం చేపట్టామని పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తి చేసుకున్న భవనాలను త్వరలో ప్రారంభించి, నిర్మాణ దశలో ఉన్న రైతు భరోసా కేంద్రాన్ని త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. నిర్మాణ దశలో ఉన్నభవనం కూడా ప్రారంభించబడితే అన్ని ప్రభుత్వ భవనాలు పూర్తి చేసుకున్న గ్రామంగా నిలుస్తామని తెలిపారు. మేజర్ పంచాయతీ భట్టిప్రోలు గ్రామాల్లో ఒక్క భవనం కూడా పూర్తి కాలేదు. కనీసం శంకుస్థాపన కూడా నోచుకోక పోవటం విశేషం. గత ప్రభుత్వ పాలనల్లో నిర్మించిన కార్యాలయంలోనే కొనసాగుతుండగా రెండవ సచివాలయం అద్దె భవనంలో కొనసాగుతుంది. ఈ గ్రామంలో ఉన్న నాయకత్వంలో సమన్వయం లేకపోవటం, ప్రభుత్వ భవన నిర్మాణాల పట్ల ఆసక్తిని కనబర్చకపోవటంతో ఒక్క భవనాన్ని కూడా నిర్మించ లేకపోవటం విచారకరమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంభంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామం భివృద్ధిపై చొరవ చూపాలని ప్రజలు కోరుతున్నారు.



మాచర్లలో ప్రారంభానికి సిద్దం చేసిన సచివాలయ భవనం



ఎంపి సురేష్‌ను కలిసిన వరికూటి అశోక్‌బాబు, అమృతపాణి

ఎంపీని కలిసిన వరికూటి సోదరులు

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి ఇన్చార్జి వరికుటి అశోక బాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి, చీరాల వైసీపీ నాయకులు డాక్టర్ వరికూటి అమృతపాణి ఎంపీ నందిగం సురేష్‌ను ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వేమూరులో పోటీ చేసేందుకు జగన్మోహన్‌రెడ్డి తనను ఇన్చార్జిగా నిమించారని, తోడ్పాటు అందించాలని ఎంపీని కోరారు. నియోజకవర్గంలో మెరుగు నాగార్జున లేని లోటు భర్తీ చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అశోక్‌బాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలో పరిస్థితులను చర్చించారు. వీరి వెంట వైసీపీ నాయకులు కంది అంజిరెడ్డి, జోషికాంత్ పాల్గొన్నారు.

విగ్రహావిష్కరణకు తరలిరావాలి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఈనెల 19న విజయవాడలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా జరగబోయే అంబేద్కర్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకరెడ్డి కోరారు. వైసిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా విజయవాడలో భారీ అంబేద్కర్ విగ్రహాన్ని నెలకొల్పిందని తెలిపారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్మన్ శింగరాజు మీనా కుమారి, బిసిసెల్ జిల్లా అధ్యక్షులు గోలి తిరుపతిరావు, మైనార్టీ సెల్ నాయకులు జలీల్, ఎస్సీసెల్ నాయకులు ప్రసాద్, వేమా శ్రీను పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

స్టువర్ట్పురంలో సెబ్ పోలీసులు ఆదివారం సోదాలు నిర్వహించారు. సార తయారు చేసేందుకు నిలువ ఉంచిన 400లీటర్ల బెల్లం ఊటను రైల్వే స్టేషన్ సమీపంలో కనుగొన్నామని సీఐ సుంకర శ్రీనివాసులు తెలిపారు. రెండు ప్లాస్టిక్ పీపాల్లోని బెల్లం ఊటను ధ్వంసం చేశామని అన్నారు. పట్టణంలోని గడియార స్తంభం వద్ద 8మద్యం సీసాలు ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వలి మృతి పట్ల విఆర్‌ఒల సంతాపం

ప్రజాశక్తి- సంతమాగులూరు

ఏల్చూరు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ మస్తాన్ వలి శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం సచివాలయం వద్ద మృతదేహాన్ని ఉద్యోగుల సందర్శనార్థం ఉంచారు. సయ్యద్ కరీం మృతదేహం వద్ద విఆర్‌ఒలు బిక్షాలు, చైతన్య, సైదా వలి, మహర్షి రామబ్రహ్మం, సుభాని, శామ్యూల్ సంతాపం తెలిపారు.

వైసీపీ, టీడీపీ ఫ్లెక్సీల చించివేత

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలో రాజకీయాలు వేడెక్కాయి. టిడిపి, వైసిపి ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు చించడంతో వివాదం రాజుకుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ, టీడీపీ నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను కోసివేయటం కలకలం సృష్టించింది. ఇలాంటి ఘటనలు గతంలో ఎప్పుడూ జరగలేదు. తాజా ఘటనతో నేతలను ఆందోళన కు గురిచేసింది. ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు ఈ నెల10న నిర్వహించేందుకు ఏర్పాటు చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అనగాని కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తు పట్టణంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో కొంతమంది దుండగులు రాజ్యలక్ష్మి థియేటర్ సమీపంలో టీడీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు వరుసగా కోసేశారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న పోలీసు సిబ్బందిని గమనించి దుండగులు అక్కడ నుండి పారి పోయారని పోలీసులు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు రాజ్యలక్ష్మి థియేటర్ సెంటర్‌కు చేరుకుని ఆందోళన చేశారు. కేసులు నమోదు చేసి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఎస్పీ మురళీ కృష్ణకు పిర్యాదు చేసారు. ఇదిలా ఉండగా మరో వైపు వైసీపీకి చెందిన ఫ్లెక్సీలు కోయటం పలు అనుమానాలకు తావిస్తోంది. టిడిపి, వైసిపికి చెందిన నాయకుల మధ్య 2019లో ఒక్కసారి ఫ్లెక్సీ పెట్టే చోట వివాదం చోటుచేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇలాంటి ఘటనలు జరగలేదని ఇరు పార్టీల నాయకులు చెప్పటం గమనారం.



రాజ్యలక్ష్మిథియేటర్ వద్ద ఎంఎల్ఎ అనగాని ఫ్లెక్సీ చింపిన దుండగులు

9 నుంచి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - పంగులూరు

ఈనెల 9నుండి 16వరకు కొండ మంజూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో కొండ మంజులూరు గ్రామంలో పానెం హనిమిరెడ్డిస్ ప్రీమియం లీగ్, భారతదేశ స్థాయిలో టి20 క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. గ్రామంలో విలేకరుల సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశంలో క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి మాట్లాడుతూ గత 29ఏళ్ల నుండి క్లబ్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ పోటీలు మొదట్లో రూ.వెయ్యి నుండి రూ.6లక్షల వరకు బహుమతులు ఇచ్చే స్థాయి వరకు క్రికెట్ క్లబ్ వచ్చిందని అన్నారు. భారతదేశంలో ఐపీఎల్ తర్వాత అతిపెద్ద క్రికెట్ పోటీలు రూ.30లక్షల వ్యయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత దేశ వ్యాప్తంగా ఐపీఎల్, రంజిస్థాయి ఆటగాళ్లతో కూడిన జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు. పోటీలను వైసిపి ఇన్చార్జి పానెం హనుమిరెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మొదటి బహుమతి రూ.6లక్షలను హనిమిరెడ్డి, రెండో బహుమతి రూ.4లక్షలు వైసిపి స్టేట్ జాయింట్ సెక్రెటరీ బివి కృష్ణారెడ్డి, మూడో బహుమతి రూ.2లక్షలను క్రికెట్ క్లబ్ చైర్మన్ కరణం స్వామి అందిస్తున్నట్లు చెప్పారు. కమిటీ సభ్యులు షెడ్యూల్ మ్యాచ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో క్రికెట్ క్లబ్ కమిటీ సభ్యులు వెంకన్న బాబు, వేణుబాబు, రాజబాబు, శ్రీనివాసరావు, ప్రభాకర్, వీరాంజనేయులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నమెంట్ షెడ్యూల్ బ్రోచర్ విడుదల చేస్తున్న ప్రతినిధులు

జనసేన జెండా రెపరెపలాడాలి: రియాజ్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నియోజకవర్గంలో జనసేన జెండాను రెపరెపలాడించడమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ కోరారు. స్థానిక 32వ డివిజన్ గద్దలగుంట గాంధీబొమ్మ సెంటర్‌లో జనసేన జెండా ఆదివారం ఆయన ఆవిష్కరించారు. వాడవాడలా జనసేన పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని గద్దెదింపే రోజులు దగ్గర పడ్డాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, చిరంజీవి యువత అధ్యక్షులు అడుసుమల్లి వెంకట్రావు, జనసేన నగర అధ్యక్షులు మలగా రమేష్, నాయకులు ఆమంచి రాజేంద్ర, రాయపాటి అరుణ, ముత్యాల కళ్యాణ్, రాయని రమేష్, పిల్లి రాజేష్, పల్ల ప్రమీలా, దండే అనీల్, గద్దలగుంట జనసేన నాయకులు గాజుల అనీల్ పాల్గొన్నారు. తొలుత రాజపానగల్ రోడ్డులోని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి, గద్దలగుంట మూడు బొమ్మల సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి, గాంధీవిగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



చేనేత నాయకులులక్ష్మినరుసును పరామర్శిస్తున్న మోపిదేవి

ఎంపీ మోపిదేవి పరామర్శ

ప్రజాశక్తి - చెరుకుపల్లి

అనారోగ్యంతో చికిత్స పొందిన కార్యకర్తను, రోడ్డు ప్రమాదంలో గాయపడిన కార్యకర్తను రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు ఆదివారం పరామర్శించారు. కనగాల గ్రామానికి చెందిన చేనేత సహకార సంఘం నాయకులు రాచా బత్తునిలక్ష్మీ నరుసు, ఇటీవల అనారోగ్యంతో ఆపరేషన్ చేయించుకోగా అయినను, గూడవల్లికి చెందిన సర్పంచ్ నలిగల నాగేశ్వరరావు కుమారుడు నాని ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో ఆయనను పరామర్శించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఏడుకొండలురెడ్డి పాల్గొన్నారు.



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపిపి లలిత

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అర్హులైన వృద్ధులు, వికలాంగులకు విడుదల చేసిన నూతన పెన్షన్లపై పెదపులివర్రులో వైసీపీ నాయకులు జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం పాలాభిషేకం చేశారు. ఎంపీపీ డివి లలిత కుమారి ఆధ్వర్యంలో పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ రూ.3వేల వరకు పెంపుదల చేయడమే కాకుండా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పెన్షన్ మంజూరు చేస్తున్నట్లు వైసిపి నాయకులు మల్లేశ్వరరావు తెలిపారు.



కాలువలో బోల్తాపడ్డ 108 వాహనం

కాలువలోకి దూసుకెళ్లిన '108'

ప్రజాశక్తి - వేమూరు

అమర్తులూరు మండలం పెదపూడి గ్రామం వద్ద ఆదివారం తెల్లవారు జామున 108వాహనం మంచులో దారి కనిపించక తెనాలి, నిజాంపట్నం కాలువలోకి దూసుకు వెళ్ళింది. గోకర్ణ మఠం నుండి తెనాలి వైద్యశాలకు రోగులను తీసుకువస్తున్న 108వాహనం పెదపూడి వంతెన సమీపంలోకి రాగానే తీవ్రంగా ఉన్న మంచు కారణంగా రహదారి కనిపించక కాలువలోకి దూసుకు వెళ్ళింది. ఈ సంఘటనలో గోకర్ణ మఠానికి చెందిన బర్రె నరసింహారావు, తండ్రి వెంకటేశ్వర్లు, భార్య లక్ష్మి, కోడలు రమణలకు స్వల్ప గాయాలు అయ్యాయి. సంఘటన సమాచారాన్ని 108వాహనం డ్రైవర్ అంకమ్మరావు అమర్తలూరు వైద్యశాల 108వాహనానికి ఫోన్ చేయగా క్షతగాత్రులను వైద్యశాలకు తరలించారు. కాగా 108వాహన టెక్నీషియన్ దున్న సురేష్‌కు పక్కటెముక ఫ్యాక్చర్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు.

బాలిక పట్ల అసభ్య ప్రవర్తన

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో యువకుడి అసభ్య ప్రవర్తనపై బాలిక తల్లి, దండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధిత బాలిక తల్లి, దండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

మోకాళ్లపై నిలబడి నిరసన

- 'సమగ్ర' ఉద్యోగులకు యుటిఎఫ్ మద్దతు - 19వ రోజుకి నిరవధిక సమ్మె



మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న సమగ్ర ఉద్యోగులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలియజేశారు. సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఫెడరేషన్ జెఎసి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె 19వ రోజుకి చేరుకుంది. కార్యక్రమానికి జెఎసి జిల్లా అధ్యక్షులు ఎం.హరిబాబు అధ్యక్షత వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు మద్దతు తెలిపిన రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజి శ్రీనివాసరావు మాట్లాడుతూ లక్షమంది యుటిఎఫ్ సభ్యులు మీ వెంట ఉన్నారని, షోకాజ్ నోటీసులు, టెర్మినేషన్‌కి భయపడాల్సిన అవసరం లేదన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షులు రవి, సహాధ్యక్షులు షేక్ అబ్దుల్ హై, కోశాధికారి చిన్నస్వామి, టంగుటూరు మండల యూటీఎఫ్ నుంచి బ్రహ్మయ్య, కార్యవర్గ సభ్యులు రాజసులోచన, వీరాంజనేయులు మద్దతు తెలియజేశారు. మండల జిల్లా సమగ్ర శిక్ష నాయకులు శ్రీనివాసులు, శ్రీహరి, వేణుబాబు, సోమశేఖర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నరేష్ బాబు, శ్రీదేవి సుశీల, రాణి, వెంకటరత్నం మాట్లాడుతూ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు, టెర్మినేషన్లు ఉపసంహరించుకోవాలని, భయపెట్టే కొద్దీ సమ్మెను ఉధతం చేస్తామని, హెచ్ఆర్ పాలసీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.కళ్యాణి మాట్లాడుతూ భవిష్యత్తులో తమ పోరాటం ఉదతం చేస్తామని, న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే వరకు సమ్మెను విరమించమని తెలియజేశారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు మధు, నరసింహం పాల్గొన్నారు.

భారీగా సిఐల బదిలీ

16 మందికి స్థానచలనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు రేంజి పరిధిలో పలువురు సిఐలను బదిలీ చేస్తూ ఐజి పాల్‌రాజ్ ఆదివారం ఉత్తర్వులుజారీ చేశారు. చిలకలూరిపేట రూరల్‌లో ఉన్న బి.అశోక్‌కుమార్‌ను నెల్లూరు ఒన్ టవున్‌కు, ఒంగోలు రూరల్ లో ఉన్న బి.శ్రీనివాసరెడ్డిని నాయుడుపేటకు, అక్కడ ఉన్న కె.నరసింహారావును సంతమాగులూరుకు, అక్కడ ఉన్న బి.ప్రభాకర్‌ను రేంజి విఆర్‌కు బదిలీ పంపారు. రేంజి విఆర్‌లో ఉన్న డి.జగన్‌మోహన్‌రావును నాయుడుపేటకు, నాయుడుపేటలోఉన్న వై.వీర సోమయ్యను గుంటూరు రేంజి విఆర్‌కు, పొన్నూరు టౌన్‌లో ఉన్న ఖాజా హుస్సేన్‌ను నెల్లూరు నాల్గో టౌన్‌కు, అక్కడ ఉన్న బి.వి.వి.సుబ్బారావును రేంజి విఆర్‌కు, తిరుపతి కమాండ్ కంట్రోలు సెంటర్ సి.కృష్ణారెడ్డిని నర్సరావుపేట వన్‌టవున్‌కు, అక్కడ ఉన్న ఎ.అశోక్‌కుమార్‌ను పల్నాడు జిల్లా డిసిఆర్‌బికి, నర్సరావుపేట ట్రాఫిక్ సిఐ యు.శోభన్‌బాబును పల్నాడు జిల్లా జిల్లాశిక్షణాకేంద్రానికి, ఇక్కడ ఉన్న టి.విజయ్ కృష్ణను రేంజివిఆర్‌కుపంపారు. ఈమేరకు ఐ.జి.ఉత్తర్వులు జారీ చేశారు. సిఐలందరూ తక్షణమే విధుల్లో చేరాలని సూచించారు.



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

భిక్షాటన చేసి నిరసన

ప్రజాశక్తి-చీమకుర్తి

మున్సిపల్ కార్మికులు సమ్మెలో భాగంగా భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఆదివారం స్థానిక పట్టణంలోని ప్రధాన వీధుల్లో భిక్షాటన చేశారు. కార్యక్రమంలో యూనియన్ పట్టణ నాయకులు పి.ఏడుకొండలు, ఏడుకొండలు, నరసయ్య, జ్యోతి, రాధ, ఎలీషా పాల్గొన్నారు.

1442 మందికి వైద్యసేవలు

రెగ్యులర్ మెడికల్ క్యాంపునకు విశేష స్పందన



పేషెంట్లకు సూచనలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

దాచూరి రామిరెడ్డి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో ఒంగోలు డిఆర్ఆర్ మున్సిపల్ హైస్కూలులో ఆదివారం జరిగిన రెగ్యులర్ మెడికల్ క్యాంపుకి విశేష స్పందన లభించింది. మెడికల్ క్యాంపులో 1442 మందికి వైద్యులు సేవలందించారు. ఈ మెడికల్ క్యాంపులో డాక్టర్ బి. హరిబాబు , డాక్టర్ రవితేజ పాల్గొని వైద్య సేవలు అందించారు.ఈ మెడికల్ క్యాంపులో మొత్తం 1442 .మంది రోగులు వైద్య సేవలు పొందారు, ఓ పి, టెక్నికల్, ఫార్మసీ, రిజిస్ట్రేషన్, కౌన్సిలింగ్, సర్వీస్ విభాగాలలో 110 మంది వలంటీర్స్ గా పనిచేశారని క్యాంప్ కన్వీనర్ మాదాల వెంకట్రావు తెలియజేశారు. బిపి, షుగర్, ఫిట్స్, పక్షవాతం రోగులకు గత 8 సంవత్సరాలుగా ప్రతి 2 నెలలకు ఒకసారి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నడపబడుచున్న రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహణ కోసం రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసిన డాక్టర్ బి. జవహర్ (జవహర్ నర్సింగ్ హెూమ్, చీమకుర్తి) ధన్యవాదాలు తెలియజేశారు.



బండ లాగుతున్న ఎడ్ల జత

ఉత్సాహంగా ఎడ్ల పందేలు

ప్రజాశక్తి-దర్శి

జనసేన నాయకులు గరికపాటి వెంకట్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి ఒంగోలు ఎడ్ల బల ప్రదర్శన రెండో రోజున పోటాపోటీగా జరిగాయి. 12 క్వింటాళ్ల బండలాగుడు ప్రదర్శనలో 21 జతలు పాల్గొన్నట్లు నిర్వాహకులు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న ఎడ్ల జత నిర్వాహకులకు గరికపాటి వెంకట్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గరికపాటి వెంకట్‌తో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొటుకు రమేష్, రాష్ట్ర సెక్రటరీ అధికారి చల్లా వాసుదేవరావు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

కోడిపందేల నిర్వాహకులపై కఠిన చర్యలు


ఎస్పీ వకుల్‌జిందాల్



ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కోడిపందేలు, పేకాట, మట్కా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ముఖ్య ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడిపందాలు, జూదం, మట్కా వంటి వాటి వలన అనేక మంది సులభంగా వచ్చే అధిక డబ్బులకు ఆశపడి పందాలు కాసి వారి ధనాన్ని నష్టపోతున్నారన్నారు. దీనివలన వారి కుటుంబాల జీవనవిధానం అస్తవ్యస్తం అయ్యే అవకాశం ఉందన్నారు. కనుక జిల్లాలో ఎక్కడ కోడిపందాలు, జూదం నిర్వహించకుండా వుండేందుకు గతంలో వీటిని నిర్వహిస్తూ, ఆడుతూ పట్టుబడిన వారు మరల వాటి జోలికి వెళ్లకుండా బైండవర్ చెయ్యడం జరుగుతుందన్నారు. గతంలో కోడిపందాలు, పేకాట, మట్కా నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా జిల్లాలో కోడిపందాలు నిర్వహించినా, పందేలు నిర్వహణకు స్థలాలు, భూములు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొందరు యువకులు జూదం అనే వ్యసనానికి బానిసలై.. తమ ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. జూదంలో కోల్పోయిన డబ్బులను సంపాదించడానికి చిన్నచిన్న దొంగతనాలు చేయటానికి సైతం వెనుకాడట్లేదన్నారు. శాంతిభద్రతలను అదుపులో ఉంచటం కోసం అసాంఘిక కార్యకలాపాలలో పాల్గొనే వారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిని ఉపేక్షించబోమన్నారు. జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కి లేదా డయల్ 100, 112 నంబర్ లకి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీస్ శాఖకు సహకరించాలని, దీని వల్ల ప్రజలకు మెరుగైన సేవలను అందించగలుగుతామని ఎస్పీ తెలిపారు.

● దామచర్లను కలిసిన 'గరికిపాటి'



ఒంగోలు మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు దామచర్ల జనార్ధన్‌రావుని జనసేన పార్టీ దర్శి నియోజకవర్గ నాయకులు గరికిపాటి వెంకట్ ఆదివారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి.. పుష్పగుచ్ఛం అందజేశారు.

- ప్రజాశక్తి, ఒంగోలు

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

- కరెంటు పొదుపు అందరి బాధ్యత - విద్యుత్ శాఖ ఇఇ జి.ఆంజనేయులు





ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నూతనంగా ఏర్పడిన బాపట్ల జిల్లాలో ఉన్న విద్యుత్ సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నట్లు ఆ శాటఖ బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.ఆంజనేయులు తెలిపారు. విద్యుత్ సరఫరాలో వస్తున్న సమస్యలు, విద్యుత్ పొదుపు తదితర అంశాలపై 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వివరించారు.

గత నెలలో సంభవించిన తుపాను బాపట్ల వద్దనే తీరం దాటడంతో వచ్చిన పెనుగాలులకు వందల కొద్దీ విద్యుత్ స్తంబాలు నేలకొరిగాయి. విద్యుత్ శాఖకు భారీ స్థాయిలో నష్టం వాటిల్లింది. తుపాను తీరం దాటే సమయంలో విద్యుత్‌ను నియంత్రించడం ద్వారా కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకున్నాం. పెనుగాలులకు జిల్లాలో 400 పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి సత్వరమే విద్యుత్‌ను పునరుద్ధరించాం. బాపట్ల జిల్లాగా ఏర్పడినప్పటికి ఇంకా జిల్లా కార్యాలయం ఏర్పాటు, జిల్లా అధికారుల సర్దుబాటు జరగలేదు. ఉన్న అధికార సిబ్బందితోనే అంతరాయం లేకుండా మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తున్నాం. మరింత మేలైన విద్యుత్ సరఫరా కోసం నూతన ట్రాన్స్‌ఫార్మర్లు, ఫీడర్స్, విద్యుత్ లైన్లను మార్చేందు కోసం తగిన ప్రతిపాదనలు పంపుతున్నాం.

జిల్లాలో 104 విద్యుత్ సబ్‌స్టేషన్లు

జిల్లాలో ఉన్న 104 సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతోంది. 4 లక్షలా 93 వేల సాధారణ విద్యుత్ సర్వీసులు జిల్లాలో ఉన్నాయి. కమర్షియల్ సర్వీసులు 47,725, పరిశ్రమలకు సంబంధించిన సర్వీసులు 1,934, మందిరాలు, మసీదులు, చర్చిలకు సంబంధించి 9,266 సర్వీసులు ఉన్నాయి. ఆక్వా పరిశ్రమలో 3,264 సర్వీసులు ఉండగా, వ్యవసాయ రంగ సర్వీసులు 37,627 ఉన్నాయి. వ్యవసాయ,ఆక్వా రంగాలకు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకున్నారు.

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత

విద్యుత్ పొదుపు అందరి బాధ్యత అనే విషయాన్ని వినియోగదారులకు తెలియజెప్పేందుకు విద్యుత్ ఆదా చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరుతూ గత నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు నిర్వహించాం. విద్యార్థులు, ప్రజల్లో ఇంధన పొదుపుపై అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టాం. ఎల్ఈడీ బల్బుల వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవుతుంది. అందుకే ఈ బల్బుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం. గృహాల్లో వీలైనంత వరకు విద్యుత్‌ను ఆదా చేసే స్టార్ రేటెడ్ ఉపకరణాలను ఉపయోగించాలని, భవిష్యత్ తరాల కోసం, భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని పొదుపుగా ఉపయోగించాల్సిన అవసరముందనే అంశాల గురించి విస్తృత ప్రచారం చేస్తున్నాం. సహజంగా ఫ్యాన్లు, ఫ్రిజ్, టీవీ, కంప్యూటర్లు, ఏసిలు, ఓవెన్లు, ఎలక్ట్రిక్ కుక్కర్లు వంటివి వాడకం వల్ల విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుంటాయి. ఈ పరికరాలను వినియోగించేప్పుడు పొదుపు చిట్కాలను పాటించాలి. పగటిపూట వీలైనంత సమయం విద్యుత్ లైట్ల వినియోగాన్ని తగ్గించాలి. రాత్రి సమయంలో సాధ్యమైనంత త్వరలో దినచర్యలను ముగించుకొని విద్యుత్ వాడకాన్ని తగించుకోవాల్సిన అవసరం ఉంది. అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు తప్పనిసరిగా ఆపివేయాలి. విద్యుత్‌ను పొదుపు చేయడమంటే ధనాన్ని ఆదా చేయడమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.